లేచాను, పడమటింట్లో వక్కపొడి తీసుకుంటుండే గూట్లో రాధపుస్తకాలు కన్పించినయి. నాకెందుకో ఒక ఆలోచన తట్టింది. రాధ పుస్తకాలన్నీ ముందుపడేసుకున్ని తిప్పాను. ఏమైనా ఉత్తరాలు అగుపడతాయేమోనని నా అభిప్రాయం. ఎట్టట్ట బౌండు పుస్తకంలో ఓ ఉత్తరం తెల్లకాగితం మీద శుభ్రంగా రాసివున్నది అవపడ్డది, తీసిచదివాను.

రాధకు,

నేను నీవనుకునేటంత పశువునుగాను. నాకూ చదువూ సంస్కారమూ వున్నవి. డబ్బులేదు. అదేగానీవనేది? నిజమే. అదేవుంటే నిన్ను పొందగలిగేవాణ్ణి. ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. ఆలోచించు. తొలేకాసినాడు, దీపారాధన చేయటానికి వచ్చినప్పుడు వీరభద్రస్వామి గుళ్లో చూపుల్తో మాట్లాడుకున్న పవిత్రమైవ భాషలోని భావం గుర్తుచేసుకో.

నిన్ను యీ మాటలను ముఖాముఖి అడిగినందుకేగా నన్ను పశువుకింద జమకట్టావు. రాధా, నీకు హృదయంలేదు. నీవల్ల మా అమ్మ ఎంతో బాధపడుతుంది. ఆవిడ బ్రతికివున్నంతవరకూ నాకేం ప్రేమలేదన్నావు కదూ? అవును వుండదు. తరచి తరచి నీ హృదయంలో బాధ రేకెత్తించాలని లేదు. జీవితంలో నేను పొందదగింది ఏమీలేదు. చాలా దగాపడ్డాను.

నీ సౌఖ్యాన్ని ఆకాంక్షిస్తూ, కళ్ళనీళ్ళతో
రామనాథం.

రెండురోజులుపోయాక రామనాథం కనపడ్డాడు గొణుక్కుంటూ. తరువాత ఊరికొచ్చేశాను.

---

స్కెచ్

# విచ్ఛిన్న భ్రాంతి

"భరణి"

"నిన్ను ప్రేమిస్తున్నాను లలితా!" అన్నాడు మూర్తి.

ఆ మాట వినగానే లలిత హృదయం ఒక్కసారిగా కంపించిపోయింది. బెదురు చూపులు చూచింది. ఇదేమాట యిప్పటికి యిద్దరు! యితను మూడోవాడు. లలిత దురదృష్టమో ఏమోగాని లలితను చూడగానే ఆకర్షిస్తారు.

ప్రేమోన్మాదంలో పడ్డవాడు ప్రపంచమంతా ప్రేమమయం అనుకుంటాడు. ఆ మత్తులో ఇతరుల విషయం ఆలోచించడు. తను ప్రేమిస్తున్నాడు. వాళ్లుగూడా ప్రేమిస్తున్నారు అనుకుంటాడు. మూర్తి యీ పరిస్థితిలోవున్నాడు. ఎప్పటినుంచో అనుకుంటున్నాడు. అడుగుదామని కాని లలిత మౌనానికి భయపడి యింతకాలం ఆగాడు. ఇక నిరీక్షించలేక అడిగేశాడు. తప్పక అంగీకరిస్తుందనుకున్నాడు. ఎందు కంగీకరించదు? తనకేమి తక్కువైనదని!

"మిమ్మల్ని చూసినప్పుడెప్పుడూ నాకా అభిప్రాయం కలగలేదు. క్షమించండి!" అంది మాటలకు తడబడుతూ నెమ్మదిగా లలిత.

మూర్తి నమ్మలేకపోయాడు. ఏమిటీ! లలితేనా మాట్లాడేది! తల తిరిగినంత పనైంది అతనికి.

"లలితా నువ్వేనా...?" అన్నాడు సగంలో ఆపి.

"నిజమే" అంది నెమ్మదిగా.

ఎవ్వరూ కదల్లేదు. కొంచెంసేపు నిశ్శబ్దం మూలిగిందా గదిలో. లోపలికి వస్తున్న చల్లగాలి కూడా లోపలికి రావడానికి భయపడిందాఅన్నట్లు తప్పుకునిపోయింది.

మూర్తికి తెలుసు యింతకుముందు యిద్దరికీ యిలాగే అయిందని. కాని ఆ మోహంలో తనూ అడిగితే ... అనుకున్నాడు. కాని ఫలితం వేరే అయింది. నిరాశ నిస్పృహ కలిగినయ్. కాని దాని వెంటనే అదోకమాదిరి అసూయలా ద్వేషం కోపం వచ్చింది. ఇలా యింత కచ్చితంగా అందరినీ వ్యతిరేకించటానికి కారణమేమిటవి? అందరూ వాళ్ళంతట వాళ్ళే వస్తున్నారనా? ఎదురు ప్రశ్నలేసి సవాల్ చేయాలనిపించింది.

"అయితే మీరు ప్రేమను ప్రేమ వివాహాన్ని నిరసిస్తారా? లేక వివాహం చేసుకుంటేగాని ప్రేమించరనుకుంటాను" అన్నాడు.

అనుకోనిప్రశ్న యెదురైంది. కొంచెం తటపటాయించింది.

"ప్రేమను ప్రేమవివాహాన్ని నేనేమీ నిరసించను. ప్రేమించినవాళ్ళు, వాళ్ళ ప్రేమ విపరీత పరిణామా లందకుండా వివాహం చేసుకోగలిగితే ఆనందిస్తాను కూడా. ప్రేమించి వివాహం చేసుకోవడమా? లేక వివాహంచేసుకుని ప్రేమించడమా? ఇదేమీ నా కసలు లేదు. వివాహం చేసుకున్న తరువాత ప్రేమించ వలసిందే. కాని వివాహం చేసుకుని ప్రేమించలేని వాళ్ళను చూస్తే నాకుజాలి. కాని అదే నేను చేయలేను. ముందు ప్రేమించనూలేను. తరువాత ప్రేమించలేను. అసలు నా మనసులో ప్రేమ అనేదేలేదు! ఎప్పుడో మోడుబారి పోయింది. మనసులో ఏమీలేదు. అంతాశూన్యం!" అని ఆగి "అరే! క్షమించండి. అనవసరంగా ఏదో వాగేస్తున్నాను" అంది.

మూర్తికి తెలిసింది. ఆమెజీవితంలో యేదో సంఘటన జరిగి వుంటుందని. తెలుసుకోవాలని వుత్సాహపడి అడిగాడు. ముందు చెప్పడానికి ఒప్పుకోలేదు. కాని మనసులోనిభారం కొంత తగ్గుతుందిగదా అని మొదలుపెట్టింది.

"నేను చిన్నప్పట్నుంచి అంతే. నా పనేదో నేను చేసుకునేదాన్ని. ఎవరితోనూ యెక్కువగా మాట్లాడేదాన్ని కాదు. మా అక్క అంటేమాత్రం నాకెంతో యిష్టం. తనతోమాత్రం కొద్దిగా మాట్లాడేదాన్ని. అప్పుడప్పుడు నా మనసుఎందుకో ఆవేదన ననుభవించేది. ఏదో ఆవేదన...అంతులేని, అర్థంకాని ఆవేదన—చీకటిలా అలుముకునేవి మనసులో! అప్పుడు ఒంటరితనాన్నాసించేది మనసు. హైస్కూలు గ్రౌండులో మనుష్యులెవరూ లేని స్థలంలో వొచ్చి కూర్చునేదాన్ని.

ఫోర్త్‌ఫారమ్‌లో వుండగా కమలతో పరిచయమైంది. కమలకూడ చాలావరకు నా అభిప్రాయాలలో ఏకీభవించేది.ఇద్దరిమనసులూ ఒకటిగావుండేవి. నాకెప్పుడైతే హృదయంలో ఆవేదన కలిగేదో అప్పుడే కమలగూడ బాధపడేది! ఇద్దరం యేమీ మాట్లాడకుండా ఒకరి వెనక ఒకరు నడచి గ్రౌండులోకొచ్చి కూర్చునేవాళ్ళం. ఏమీ మాట్లాడుకునేవాళ్ళంకాదు. అలా కొంచెంసేపుండి యిద్దరం ఒక్కసారే లేచి వచ్చేసేవాళ్ళం! అందుకని మా మనసులు కలిసినయ్. ఇప్పటికి నేను ప్రేమించిన ప్రేమిస్తున్న వ్యక్తులలో కమల రెండోది.

"ఫోర్త్‌ఫారమ్ అయిపోయింది. మళ్ళా స్కూలు తెరిచారు. కాని ఆ రోజు కమలరాలేదు. మూడు రోజులైంది కాని కమలరాలేదు. నా హృదయం ఎందుకో ఆవేదనపడుతూంది. ఆ రోజు ఆగలేక కమల యింటికెళ్ళాను. అప్పుడు తెలిసింది కమల మానేసిందని! కమలకి పెళ్ళిచేసేస్తారట! హృదయం బాధతో మూలిగింది. ఆగలేక వచ్చేసాను. మళ్ళా ఆరునెలలకి కలుసుకున్నాం. కమల అప్పుడు చెప్పిందంతా. నా దగ్గర హృదయం దాచుకోదు. చదువుకుంటున్నా తనికిచ్చి పెళ్ళిచేసారు. ఆ ధనవంతులైన అత్తగారిల్లు ఓ మూల పల్లెటూరు. అక్కడేమీ వుండదు. చివరకొక చిన్నపుస్తకం గూడా దొరకదు! ఆ పెద్దయింట్లో యెప్పుడూ ఓమూల గదిలో పడివుండాలి. అంతా అత్తగారి అజమాయిషీ. ఇక భర్తసంగతి చెప్పనవసరంలేదు. ఎదురుగా అత్తగారు వూరికేతిద్దుంటే చూసికూడా చాటుగానైనా పలకరించడు! సెలవులకువచ్చినప్పుడే చాటుగానైనా సానుభూతిచూపలేని తల్లిచాటుబిడ్డ! తనధికంగా కోరే చదువుగూడా మానేసింది. అక్కడేమైనా సుఖముందా అంటే అదీ శూన్యం! కమల యిదంతా చెప్పింది. అసలే ఆవేదనపడే మనసు అధికభారంచెంది, అర్థంలేని భావంతో నిండుకుంది. ఇద్దరం అలానే మాట్లాడకుండా కూర్చున్నాం.

"అది చక్కటి వాతావరణం పక్కనే కొబ్బరి చెట్లు చక్కగా తలలూపుతూ గాలిలో ఆడుకుంటున్నాయ్, కొద్దిగా తేమ తేమగా వుంది గాలి. సంధ్యవాలుతూంది నీరెండపడుతూవుంది. ఇద్దరంసూటిగా ఆకాశంవేపు చూస్తున్నాం. అప్పుడు యిద్దరికీ ఒకటే భావం కలిగింది. ఈ వాతావరణం అందరికీ మనసుకు యెంతో హాయినిస్తువది. కాని మనకు! ఇలా మనలా కూర్చున్నవాళ్ళింకా వుంటారా? అని ఇద్దరం ఒక్కక్షణం ఒకరిముఖాలొకరం చూసుకున్నాం. మళ్ళీ ఆకాశంవేపు చూశాం. ఇంతలో యింతకుముందు లేని చక్కటి యింద్రధనస్సు మెరుస్తూంది యెదురుగా! అలాగే చూస్తున్నాం దీక్షగా. అది యెలావచ్చిందో అలానే నిమిషాల్లో

మాయమైపోయింది మా కళ్ళయెదుటే! ఇద్దరం పెద్ద నిట్టూర్పువిడిచి ఒకరిముఖాలొకరు చూసుకున్నాం మళ్ళీ.

"చూడు లలితా యెంతలో యెంతమార్పో. ఇప్పుడు పుట్టింది, మరుక్షణంలో మాయమైపోయింది! ఒక గుణపాఠం నేర్పింది. ఇదే జీవితం! ఇప్పుడున్నవాళ్ళు మరుక్షణంలో యెలావుంటారో? మొన్నటివరకు మనిద్దరం హాయిగా చిన్నపిల్లల్లా తిరిగేవాళ్ళం. ఇంతలో నా జీవితంలో యెంత మార్పు! క్షణంలో వెలుగు, క్షణంలో చీకటి!" అంది నిరాశగా. మళ్ళా "లలితా నేనాశించి నదినాకు లభించలేదు. నువ్వైనా నీ యిష్టమైంది పొందడానికి ప్రయత్నించు. నువ్వు సంతోషిస్తేనైనా నా మనసు సగం సంతోషపడ్తుంది. నువ్వైనా నీ కోర్కెలను పొందు లలితా. నా పని ఐపోయింది. అసలు బ్రతకాలని లేదు. కాని యెందుకు బ్రతుకుతున్నానో తెలియకుండా—చావలేక బ్రతుకుతున్నాను!" అంది మరీ నిరాశగా. ఇక అక్కడ వుండలేక వచ్చేశాను. కమల జీవితం యిలా అయినప్పటినుంచి హృదయంలో ఆవేదన అధికమైంది. ఇదొక పెద్ద అఘాతమైంది నా మనసుకు.

"ఇక రెండు చిన్న సంఘటనలున్నాయ్. యస్.యస్.ఎల్.సి. పాసయ్యాను. ఆ నెలవుల్లో అక్కకు పెళ్ళిచేశారు. అక్క వెళ్ళిపోయింది. నాకెంతో బాధకలిగింది. ఇంటికిరాగానే 'అక్కా!' అనుకుంటూ వచ్చేదాన్ని. ఏ పనికావాలన్నా చెప్పకుండా చేసిపెట్టేది. ఇద్దరం ఒక్కటిగా వుండేవాళ్ళం. అటువంటి అక్కను చూడకుండా వుండలేకపోయాను. నాకు యింట్లో వున్న ఒక్క శాంతి యెగిరిపోయింది. నా పక్కన యెప్పుడూ నీడగా తిరుగుతూనే వుందా అనిపించేది! దానికి తోడు నన్ను చదువు మాన్పించేసారు. అది మరీ బాధకలిగించింది. ఇంకో ఆరునెలలకు తెలిసింది. కమల విధవ అయ్యిందని! ఎప్పుడు? ఎలా? అదంతా నాకు తెలియదు. కాని యిప్పుడు కమల విధవ. నేను పాతాళానికి దిగిపోయాను. నేను ప్రేమించిన వాటి కన్నింటికీ దూరమయ్యాను. అటు కమల జీవితం నాశనమయ్యింది. ఇటు అక్క దూరమైంది. అటు అధికంగా ప్రేమించి ఆధారంగా పెట్టుకున్న విద్యకు నాస్తి. మనం దేన్ని యెక్కువగా ప్రేమిస్తామో ఒక్కొక్కప్పుడు దానితోనే కూల్చివేయబడతాము! అది నా విషయంలో నిజమైంది. ప్రేమించిన ప్రతిదీ దూరమై నన్ను పాతాళానికి దించేసినయ్. సముద్రంలోని తరంగాల్లా యెప్పుడో నిండిపోయింది హృదయం ఆవేదనలో! కొన్ని రోజులకు ఆవేదన భరించలేక హృదయం శూన్యమైపోయింది. హృదయం శూన్యమైపోయి కళ్ళనుండి ఒకటే నీళ్ళుకారేవి. పనిలేక ఆలోచన లధికమైనయి. అందరితో మాట్లాడటం మానేశాను. పలకరిస్తే యిష్టముంటే పలికేదాన్ని; కంచంలో అన్నంపెడితే తినేదాన్ని. అప్పుడే నా హృదయంలోని భావాలన్నీ చీలిపోయినయ్. ఎంతమంచి వస్తువునుచూడు. ఎంత మంచి మనిషినిచూడు. యిష్టము, ఆసక్తి, అనేది కలగడం మానేసింది! ప్రేమ అంటే యేమిటో తెలియని పరిస్థితికి దిగజారిపోయాను!

నా మూకీభావాన్ని సహించలేక బాగుపడుతానేమోనని యీ కాలేజీలో పడేశారు. కాని ఆగత చరితపు ఆవేదన నన్ను వదల్లేదు. ఎప్పుడూ వెంటాడుతూనే వుంటుంది. ఎప్పుడూ యేకాంతాన్నాసిస్తూ వుంటుంది. ఎవ్వరూ లేనిచోటంటే తెలిసిన వాళ్ళెవ్వరూ లేని స్థలంలోకి పోయి అజ్ఞాతంగా వుందామని వుంటుంది! ఏ నిర్బంధాల్లోనూ, ప్రేమబంధాల్లోను నిలువలేదు. అందుకని యిదైపోగానే యెక్కడికైనా దూరంగా పోయి ఏకాంతవాసం చెయ్యాలని వుంది. అదొక్కటే నా కోర్కె. అదీలేకపోతే పంజరంలో పిట్టలాగ గిలగిలా తన్నుకుంటూ, చావలేక మనసు మసి చేసుకోవాల్సొస్తుంది. అది యేమాత్రం సహించలేను. ఎవ్వరు లేనిచోటకు పోవాలి! ఏకాంతం కావాలి నాకు! ఎక్కడ దొరుకుతుంది?"

అంతావిని హృదయంలో నిండుకున్న భారాన్ని భరించలేక పెద్దగా నిట్టూర్చి, మూర్తి అలాగేలేచి నెమ్మదిగా, నిశ్చలంగా నడచి బయటికి వెళ్ళిపోయాడు.

లలిత భారంగా చూస్తూ అలా కూర్చుండిపోయింది. ఇంతసేపూ చంద్రుడు తన చల్లటి వెన్నెలలో వాళ్ళమధ్య ఆడుతూనే వున్నాడు. కానివీళ్ళవద్ద గెలువలేక, అపరాజయాన్ని సహించలేక మబ్బుచాటున తల దాచుకున్నాడు. ★